విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

అంబర్‌పేట, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో సర్కిల్ 16 పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు చెత్తను తీసుకెళ్లే పుష్‌కార్ట్‌లను సోమవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డుపై సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు పుష్‌కార్ట్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలత, యూసీడీ అధికారి రజిత, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

కాచిగూడ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అన్నారు. సోమవారం నింబోలిఅడ్డలో జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్తను తరలించేందుకు పుష్‌కార్ట్ గార్బేజ్ లిఫ్టింగ్ బండ్లను పంపిణీ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెత్తను సేకరించి తరలించేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. రోడ్లపై చెత్త వేయొద్దని ప్రజలకు సూచించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు కన్నె రమేష్ యాదవ్, ఎస్ఎఫ్ఏలు విష్ణు, రామారావు, దేవా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




పారిశుధ్య కార్మికులకు పుష్‌కార్ట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

రాంనగర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల సమితి జేఏసీ ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి కోరారు. సోమవారం చిక్కడపల్లిలోని జేఏసీ కార్యాలయంలో ఉద్యమకారుడు పి. ప్రఫుల్‌రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సమితిని తెలంగాణ ఉద్యమకారుల సమితి జేఏసీగా మార్చామన్నారు. ఇక నుంచి జేఏసీ పేరుతో కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం తీర్మానించిందన్నారు.



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల సమితి జేఏసీ ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రఫుల్ రాంరెడ్డి తదితరులు

ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతోపాటు నాలుగు గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, నెలకు రూ. 30 వేల పెన్షన్, ఉచిత బస్‌పాస్ సౌకర్యం, రూ. 2 లక్షల ఆరోగ్యబీమా కల్పించాలని, వంద ఎకరాలలో ఉద్యమకారుల స్మృతివనం ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులకు కోటి రూపాయల సబ్సిడీ రుణం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అడ్వకేట్ జేఏసీ ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వైస్ ఛైర్మన్ ప్రజోతికుమార్, నాయకులు బత్తుల సోమన్న, రాములు, చంద్రన్న ప్రసాద్, సాయిలు, రంగారెడ్డి, గంటి చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.





అనిల్‌కుమార్ యాదవ్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, సన్మానిస్తున్న పట్నం నాగభూషణం గౌడ్, ఆకుల ప్రవీణ్‌కుమార్

ఘనంగా అనిల్‌కుమార్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు

ముషీరాబాద్/కవాడిగూడ/రాంనగర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎం. అనిల్‌కుమార్ యాదవ్ పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పట్నం నాగభూషణంగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న అనిల్ కుమార్ యాదవ్ భవిష్యత్‌లో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, నాయకులు గజ్జల సూర్యనారాయణ, విజయ్ ముదిరాజ్, జహంగీర్, సతీష్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు కాంగ్రెస్ పార్టీ కవాడిగూడ డివిజన్ సీనియర్ నాయకుడు ఆకుల ప్రవీణ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

● ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని పార్టీ కార్యాలయంలో అనిల్‌కుమార్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ ఛైర్మన్ నాగభూషణం, మాజీ కార్పొరేటర్లు ఆర్. కల్పనాయాదవ్, వాజీద్ హుస్సేన్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు కరణం సురేష్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ తెలుగు ఔన్నత్యాన్ని ఎలుగెత్తిన మహనీయుడు కాళోజీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాష, యాస కోసం 'నా గొడవ' ద్వారా తన జీవిత పర్యంతం పరితపించిన గొప్ప మానవతావాది ప్రజాకవి కాళోజీ అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు కొనియాడారు. తెలంగాణ తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా సోమవారం వర్సిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ జయంతి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పత్రికలు, పాలకుల భాష మాత్రమే ప్రజల భాష కాదని, ప్రజా వ్యవహారంలోని భాషను సగౌరవంగా ఆదరించాలని నినదించిన భాషా వాది కాళోజీ అని అభివర్ణించారు. ఆచార్య పి. వారిజారాణి మాట్లాడుతూ.. పీడిత వర్గ నిర్మూలనే లక్ష్యంగా కాళోజీ కవిత్వం రాశారని, ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరం అసమానతలను నిలదీస్తుందని అన్నారు. కాళోజీ భాషా వైవిధ్యం అంశంపై పి. విజయ్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణ సజీవ భాషలోని ఔన్నత్యాన్ని ఎలుగెత్తిచాటిన మహనీయుడుగా కాళోజీని కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్య వి. త్రివేణి, తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య డి. విజయలక్ష్మి, భూక్యా తిరుపతి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్ నాయక్ తదితరులు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కాళోజీ నారాయణరావుకు నివాళులర్పిస్తున్న జనార్దనమూర్తి తదితరులు

వాడుక భాషలో నారాయణరావు కవితలు

చిక్కడపల్లి: తెలంగాణ ఏర్పాటు కోసం ప్రజలపక్షం వహించి ఉద్యమించిన యోధుడు కాళోజీ నారాయణరావు రాసిన కవితలు జనసామాన్య వాడుక భాషలో ఉంటాయని వక్తలు అన్నారు. త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి సోమవారం నిర్వహించారు. కాలమిస్ట్ జయసూర్య మాట్లాడుతూ.. నారాయణరావు రాసిన సాహిత్యం పరిమితమేనని, ఆయన అపరిమిత పోరాటస్ఫూర్తి రగిలించారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కండక్టర్‌పై దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్‌పై దాడిచేసిన వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేశారు. మేడ్చల్ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న బస్‌లో బానోత్ రాణి కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బస్సులో ప్రయాణిస్తున్న జీడిమెట్ల పంచశీల ఎన్‌క్లేవ్‌కు చెందిన విజయేందర్ రెడ్డి (56) అకారణంగా కండక్టర్‌ను దుర్భాషలాడి దాడిచేశాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు విజయేందర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. ఎందుకు కండక్టర్‌పై దాడి చేశావని ప్రశ్నించగా.. కండెక్టర్ ముఖానికి స్కార్ఫ్ కట్టుకుందని, అందుకే దాడి చేశానని చెప్పాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

వసతి గృహాలకు సొంత భవనాలను నిర్మించాలి

అంబర్‌పేట, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలను నిర్మించాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఈబీసీ విద్యార్థి సంఘం నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. రెండున్నర దశాబ్దాల నుంచి సంక్షేమ వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. 8 నెలల నుంచి డైట్ చార్జీలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కృష్ణ, రాజు, రమేష్, సతీష్, గణేష్ ఉన్నారు.



సివరేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

వివేకానందనగర్‌లో రూ. 21 లక్షలతో సివరేజీ పైపులైన్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ నుంచి కృష్ణారావు లేన్ వరకు రూ. 21 లక్షల రూపాయలతో నిర్మించనున్న సివరేజీ పైపులైన్ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో సివరేజీ సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వాటర్ బోర్డు డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్ బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వినయ్‌కుమార్, రాజు, జైసింహ, రాకేష్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలామ్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలామ్ 93వ జయంతి సందర్భంగా వచ్చేనెల 22న న్యూఢిల్లీలో అబ్దుల్ కలామ్ నేషనల్ ఎక్సలెన్సీ అవార్డులు ప్రదానం చేస్తున్నామని శిఖరం ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి జి. కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత, నృత్యం, సాహిత్యం, విద్య, వైద్యం, క్రీడ, సినీ, టీవీ, సామాజికసేవ, రాజకీయ, న్యాయ, పారిశ్రామిక, న్యాయవాద, అర్చక, పురోహిత, వాస్తు తదితర రంగాలకు చెందిన వారు అవార్డులకు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9494523562 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.



కోదండరెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎంపీ వి. హనుమంతరావు

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

రాంనగర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్ఫేర్ కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు. కోదండరెడ్డికి సోమవారం బాగ్‌అంబర్‌పేటలో మాజీ ఎంపీ వి. హనుమంతరావు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కోదండరెడ్డి మాట్లాడుతూ.. పదవికి న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, పుల్ల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మూవీటైమ్స్ సినిమా థియేటర్స్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): తొలగించిన మూవీటైమ్స్ సినిమా థియేటర్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మారన్న, కార్యదర్శి అరుణ్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మికశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని మూవీటైమ్స్ సినిమా థియేటర్ సంస్థల్లో సుమారు 300 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి మూడు సంవత్సరాలుగా పీఎఫ్, డ్యూటీ టైమింగ్ అంటూ ఏమీ లేదన్నారు. యూనియన్‌లో ఉన్న కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు.



కార్మికశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్యకు వినతిపత్రం అందజేస్తున్న మారన్న తదితరులు



సేవాలాల్ జయంతి సందర్భంగా జెండాను ఆవిష్కరిస్తున్న భూక్యా సంజీవనాయక్

గిరిజనులకు ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయండి

రాంనగర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఇచ్చిన హామీ ప్రకారం 12 శాతం రిజర్వేషన్‌లను అన్ని రంగాల్లో అమలు చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల కోసం ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గ్రేటర్ అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, నాయకులు బానోత్ హుస్సేన్, రాజేష్, శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

12న ఐటీఐ కాలేజీలో జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 12వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన ఒక ప్రకటనలో తెలిపారు.

మల్లేపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో ఆ రోజు ఉదయం 11 గంటలకు టాటా కంపెనీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పాసైన అభ్యర్థులు బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లు (ఒరిజినల్, జిరాక్స్)తో మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 8328428933 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.



అల్ఫా సర్కిల్ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఆత్మవిశ్వాసంతో విజయం సాధించవచ్చు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బర్కత్‌పురకు చెందిన మడిపడిగె రాజు సారథ్యంలో ఏర్పాటు చేసిన అల్ఫా సర్కిల్ సంస్థ లోగోను సోమవారం మంత్రి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ పాజిటివ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ స్కిల్స్‌ను మెరుగుపర్చుకుంటే విజయం సాధ్యమవుతుందన్నారు. ఈ నెల 27న అల్ఫా సర్కిల్ సంస్థ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు మడిపడిగె రాజు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆనంద్, శ్రీకాంత్, విపిన్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వైద్యుడి విరాళం



వరద బాధితుల సహాయార్థం అపోలో ఆస్పత్రి ప్రముఖ వైద్యుడు డాక్టర్ జె. జయప్రకాష్ సాయి ముఖ్యమంత్రి సహాయనిధికి లక్ష రూపాయలను ఆన్‌లైన్‌లో పంపించారు. దీనికి సంబంధించిన ఆన్‌లైన్ రసీదును మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం అందజేశారు.

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

క్షేత్రస్థాయి ఫిర్యాదులపై డిస్కం సీరియస్

● కార్యాలయాల్లో అవినీతి సెల్ ఫిర్యాదు నంబర్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పనితీరు, అవినీతి ఆరోపణలపై దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. కార్యాలయాల్లో అవినీతి సెల్‌కు సంబంధించిన ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండేలా 10 వేల పోస్టర్లు డిస్కం కార్యాలయాల్లో అంటిస్తున్నారు. పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లలో సిబ్బంది అందుబాటులో ఉంటారని అధికారులు చెబుతున్నారు. నిబంధనల పేరుతో కొంతమంది అధికారులు అక్రమవసూళ్లకు పాల్పడుతూ విద్యుత్‌సంస్థలకు చెడ్డ పేరు తెస్తున్నారని, దీంతో అక్రమాధికారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ దృష్టిసారించారు. ఫిర్యాదులు వచ్చిన అధికారులు, సిబ్బందిపై విజిలెన్స్ విచారణతోపాటు తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి ముందు మెమోలు జారీచేస్తామని, వారు తీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తామన్నారు. శివారు ప్రాంతాల్లోని సర్కిళ్లనుంచి విద్యుత్‌శాఖ ప్రధానకార్యాలయానికి ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. అవినీతిపై 040-23454884, 7680901912 నంబర్‌లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఎస్‌బీఐ మేనేజర్ భార్య ఆత్మహత్య

బేగంపేట, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ మేనేజర్ భార్య ఆత్మహత్య చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కేరళకు చెందిన హరీష్ జి. ప్రభుకు రంజిత పి. మలీయాతో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు. ప్రభు ఎస్‌బీఐలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అతడికి ఇటీవల హైదరాబాద్ బదిలీ కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వచ్చి బేగంపేటలోని ఎయిర్‌లైన్స్ కాలనీలో కోరల్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఏప్రిల్‌లో రంజిత తల్లి మృతిచెందింది. అప్పటి నుంచి ఆమె తీవ్ర మనోవేదనతో బాధపడుతోంది. సోమవారం ఉదయం 8.30 గంటలకు హరీష్ బ్యాంకుకు వెళ్లారు. కొద్దిసేపటికే అపార్ట్‌మెంట్‌కు చెందిన వారు ఫోన్ చేసి మీ భార్య భవనంపై నుంచి పడి చనిపోయిందని ఆయనకు చెప్పడంతో వెంటనే ఇంటికి చేరుకుని చూడగా చనిపోయి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రంజిత పి.మలీయా (ఫైల్)

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

బర్కత్‌పుర, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి - యాకుత్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య 40 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి సోమవారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి ఆత్మహత్యకుగల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిప్పంటించుకుని పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం

బేగంపేట, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌కు చెందిన పత్తిపాటి అఖిల్, సరిత భార్యాభర్తలు. అఖిల్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వచ్చిన ఆదాయంతో నిత్యం మద్యం తాగి భార్యను వేధిస్తుండడంతో ఆమె బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కౌన్సెలింగ్ కోసం పోలీసులు అఖిల్‌ను స్టేషన్‌కు పిలిచారు. అవమానంగా భావించిన అతడు తనవెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను స్టేషన్‌లోనే శరీరంపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. పోలీసులు వెంటనే మంటలను ఆర్పివేశారు. స్వల్పంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు యత్నించిన అఖిల్‌పై కేసు నమోదు చేశారు. నిత్యం మద్యం తాగి వచ్చి చిత్రహింసలకు గురిచేయడంతో భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఆయన నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని సరిత కోరారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

డీసీపీ అక్షాన్ష్‌యాదవ్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సెంట్రల్‌జోన్ డీసీపీ అక్షాన్ష్‌యాదవ్ సూచించారు. బాగ్‌లింగంపల్లి మూన్‌కేఫ్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్ఐ నాగరాజుతో కలిసి పూజలు నిర్వహించారు. నిర్వాహకుడు జైపాల్‌రెడ్డి డీసీపీని సన్మానించారు.

జవహర్‌నగర్‌లో దీపకళా ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మండపంలో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించి మండప నిర్వాహకులకు సూచనలు చేశారు.

అశోక్‌నగర్‌లో గజానంద్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మండపం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఏకదంతుడికి 21 కిలోల లడ్డూ

ముషీరాబాద్: బాపూజీనగర్‌లో ఓం శివ గంగాభవానీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి 21 కిలోల లడ్డూను బీఆర్ఎస్ నాయకుడు కె. బాబురావు అందజేశారు. ముషీరాబాద్ శక్తియూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడికి చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి పూజలు చేశారు.



వినాయకుడికి 21 కిలోల లడ్డూను అందజేస్తున్న కె. బాబురావు



అంబర్‌పేటలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న శంకర్‌నగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, పూర్ణచందర్, బ్రహ్మచారి, సత్యనారాయణ



బాకారంలో వినాయకుడి పూజలో రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి తదితరులు



బాగ్‌లింగంపల్లి మూన్‌కేఫ్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో పూజలు నిర్వహించిన డీసీపీ అక్షాన్ష్ యాదవ్, ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్ఐ నాగరాజు